# మూషిగిరి-శేషకాలు

ఆదివారం సాయంకాలానికి ఇంటికి వచ్చాను సెలవలకి. ఆరాత్రి వరాండాలో కూర్చున్నాము అందరం రేడియో వింటూ. మధ్యమధ్య నేను మా కాలేజీ విశేషాలు చెప్తున్నాను. శేషగిరి (వాడు మా అన్నయ్యలెండి) కాళ్ళు పైన పెట్టుకొని కుర్చీలో కూర్చున్నాడు. ముందు అలా ఎందుకూర్చున్నాడో తెలిసిందికాదు నాకు. తర్వాత మా చెల్లి చెప్పింది. ఇంట్లో ఎలుకలు ఎక్కువగా తిరుగుతున్నాయని. మా యిల్లు చాలా పురాతనమైనది. (మా రాజమండ్రిలాగే మా యిల్లు కూడా రాజరాజనరేంద్రుడి కాలంనాటిదై వుంటుంది) మునుపు పందికొక్కుల బాధ ఎక్కువగా ఉండేది. నేలఅంతా సిమెంటు గచ్చుచేసి, గోడలన్నీ గరుజుచేసిన తర్వాత వాటి బాధ తగ్గింది. కాని మళ్ళి యీ ఎలుకలు పట్టుకున్నాయన్నమాట పైగా శేషగిరివాలకం చూస్తే నవ్వొస్తుంది. ఎలుకలకి భయపడి కాళ్లు కుర్చీలో పెట్టుకున్నాడు. పైగా జూఆలజీ క్లాసులో ఎలుకలతో ఎక్స్పరిమెంట్స్ చేశానని కోస్తాడు వీడు! ఇంతట్లోకే ఓ ఎలక కీచుకీచుమంటూ నా కాళ్ళమీదనుంచి పరుగెట్టింది. చెప్పద్దూ, నాకు నిజంగా ఒళ్లు గగుర్పొడిచింది నేనూ కాస్త భయస్థుణ్ణే కాని మా శేషగిరంత పిరికివాణ్ణి కాదు

మర్నాడే వాటిపని పట్టేయాలనిపించింది. దానికి కావలసిన పరికరం ఎలుకబోను. అదెక్కడో అటకమీద ఉండే వుంటుంది. బ్యాటరీలైటు శేషగిరి కిచ్చి అటకెక్కి ఎలుకబోను తీయమన్నాను. వాడెక్కనుగాక ఎక్కనన్నాడు. వాడి పిరికితనానికి మా అమ్మలగాయతు, మా చెల్లివరకు నవ్వేశారు. నేనొక హీరోలా ఫోజుపెట్టి అటకెక్కాను. ఎక్కానన్న మాటే గాని అక్కడ నరకంలా వుంది. చాల ఉక్కగా ఉంది. చెమటతో ఒళ్లంతా తడిసిపోయింది. కాని ధైర్యంగా బ్యాటరీ లైటు వెలిగించి చూశాను ఒక మూల ఆ బోను కనబడింది. ఒక అరడజను ఎలుకలు దానితో దాగుడుమూత లాడుకుంటున్నాయి. వాటిమీద ఒక బెడ్డ విసిరి అవి పారిపోయిన తర్వాత బోను తీసికొని దిగి వచ్చాను ఇంక దానిలో ఒక ఎర పెట్టాలి. వాసనకొట్టే ఒక చేప పెట్టితే అన్నిటికంటె బెస్టు అని చెప్పి మా ప్రక్కింట్లోంచి ఒక ఉప్పుచేప తెప్పించి ముక్కు మూసికొని దానికి తగిలించాను. అది తెగ వాసన కొట్టోంది. రాత్రి 9 గంటలకి వంటింట్లో పెట్టి వరాండాలోకి వచ్చి పడుకొన్నాము. పడుకొన్నామన్నమాటే గాని ఎవరూ నిద్రపోవడానికి ప్రయత్నించడం లేదు. ఆ బోనులో ఎప్పుడెలుక పడుతుందా అని ఎదురుచూస్తున్నాము. కొంతసేపటికి వంటింట్లో అలికిడయింది. పరుగెట్టుకొని వెళ్ళా మందరమూ.

లైటు స్విచ్చివేశాము బోనులో నిజంగా ఎలకేపడింది. కాని నేను స్విచ్చి వేశేసరికి హడిలిపోయి కీచుమంటూ బోను ఊచల ద్వారా బయటికి పారిపోయింది. (ఆ ఊచల మధ్య *space* కన్నా చిన్నది ఆ ఎలుక) గుమ్మందగ్గరున్న మా శేషగిరి "బాబోయ్" అని ఎగిరి గంతేశాడు. ఆ ఎలక వాడి కాళ్ళ మధ్యనించి పారిపోయిందట! ఎలక పారిపోయినందుకు విచారించాలో లేక శేషగిరిని చూసి నవ్వాలో తెలియలేదు మాకు. బోనులో ఎర సగంవరకు తరిగిపోయింద. సరే ట్రై అండ్ ట్రై ఎగైన్ అనుకుంటూ మళ్ళి లైటు ఆర్పేసి వచ్చాము. ఈసారి మంచాలమీద కూర్చుని ప్రక్కగదిలో బాంబు ప్రేలుతుందేమో నన్నంత ఆదుర్దాగా చూస్తున్నాము. మా శేషగిరింకా షాక్ నించి తేరుకోలేదు. ఇంతట్లోకే పెద్ద పెద్ద శబ్దాలు వినబడ్డాయి. మళ్ళి అందరమూ పరుగెత్తాము. ఈసారి పెద్ద ఎలకే పడింది. ఘుర్ ఘుర్రుమంటూ బోనులో కొట్టుకుంటున్నది. సరే మన పాచిక పారింది. ఇంక దీన్నెలా చంపడమో ఒక సమస్యయి కూర్చుంది. బయటికి తీసికెళ్లి వదిలిపెట్టడము సమంజసంగా లేదు. బయట వదిలిపెట్టే మళ్ళి ఇంట్లోకే దూరితే. ఇంతలోకే మా చెల్లి ఒక సజెషన్ చేసింది. నీళ్లున్న గుండిగలో వదిలిపెట్టి రాత్రంతా అందులో వుంచి ప్రొద్దున్నే వచ్చినతర్వాత దాసీ దానిచేత బయట పారేయించడం. ఆగుండిగ మేం ఉపయోగించడంలేదు కాబట్టి ఈ సజెషన్ చాలాబాగుంది. మా శేషగిరిగాడికి ఏం బుద్ధి పుట్టిందో ఆ ఎలకను గుండిగలోకి నేను వదుల్తాను అన్నాడు. మేం ఆశ్చర్యపోతూ సరేనన్నాము. వాడు ఎలుకబోను ఎత్తి నెమ్మదిగా గుండిగదగ్గరకు వెళ్ళాడు. నేను ఇంకా ఎలుకలు పట్టాలనే వుద్దేశంతో ప్రక్కింటి వాళ్ళని ఇంకో చేప అడగటానికి వెళ్తున్నాను. ఇంతట్లోకే కెవ్వుమని శేషగిరి అరవడం, బోను నీళ్ళలోకి వదిలెయ్యడం జరిగింది. నేను పరుగెట్టి వెళ్లేసరికి వాడొక కాలుమీదే నించుని గోలెత్తున్నాడు. రెండవ కాలు మోకాలు వరకే ఉంది. తర్వాత భాగము కనబడటం లేదు. "ఒరే గిరి! నీ శేష (మిగిలిన) కాలు ఏదిరా?" అని అరిచాను. వాడప్పుడు ముడిచి వున్న రెండవ కాలు క్రిందికి దించాడు. వేళ్లదగ్గర రక్తం కారుతున్నది. బాధతో వాడు కాలు మోకాలివద్ద వంచి వెనక్కి చేతితో పట్టుకొన్నాడు. ఎదుట్నించి చూస్తున్న నాకు మోకాలివరకే కనబడుతున్నది. అందుకని అలా అడిగాను. ఏంజరిగిందో మా చెల్లాయి చెప్పింది. వాడు ఎలుకబోను పట్టుకొని తలుపు తెరిచాడట ఎలకను నీళ్ళలోనికి వదలడానికి. కాని వీడికంటె జిత్తులమారిది ఆ ఎలక. నీళ్లలోకి పడటం బదులు ఎగిరి వీడి కాలిమీదబడి కసికొద్దీ వేళ్లు కొరికి పారిపోయిందట. ఇది వినేసరికి నాకు నవ్వాగిందికాదు. వాడు కడవలతో కళ్లనుండి నీళ్లు గుమ్మరించేస్తున్నాడు. ఎలుకల బాధ వదలలేదుగాని వాడి కాలు నయమయేసరికి వారంరోజులు పట్టింది. అప్పట్నించి వాడ్ని "మూషిగిరి" (మూషికం + శేషగిరి) అని పిలుస్తుంటాం. నేనుమాత్రం "నీ శేషకాలు ఏదిరా" అని ఏడిపిస్తూనే ఉంటాను.

★

కావలెను
ఉన్నికాల్వలకు ఏజెంట్లు కావలెను. సాంపిల్సు.
వివరములు ఉచితము.
Western Textiles, LUDHIANA (21).

ప్రశిద్ధమైన నంజనగూడు పండ్లపొడి వారి
అగత్యమైన కుటుంబ ఔషధములు
కాస్మస్ కస్తూరి మాత్రలు...సీసా 0-6-0
కర్జిక్ గోరోజన మాత్రలు... 0-8-0
బాలక్స్ శిరోవనమగుటకు మాత్రలు... 0-6-0
మా మందుల పూర్తి జాబితాకు వ్రాయుడు
యునైటెడ్ కన్సర్న్, బందరు వీధి, మద్రాసు-1, విజయవాడ.